# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-10-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. రాష్ట్రంలో పురపాలక ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈ రోజు నుంచి ప్రారంభమైంది.**

**2. మూలా నక్షత్రం సందర్భంగా విజయవాడ కనకదుర్గమ్మకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సాయంత్రం పట్టువస్త్రాలు సమర్పిస్తారు.**

**3. ఆహార వృథాను అరికట్టడంపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ రోజు ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

**4. ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది.**

==========================

రాష్ట్రంలో పురపాలక ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈ రోజు నుంచి ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో నామినేషన్లు ఈ రోజు నుంచి స్వీకరిస్తున్నారు. మొత్తం 5 వేల 485 కేంద్రాల్లో నామినేషన్ల స్వీకరణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. అభ్యర్థులు నామపత్రాలు దాఖలు చేసేందుకు మూడు రోజుల పాటు అవకాశం కల్పించింది. ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు.

కాగా చిత్తూరు జిల్లాలోని పుంగనూరులో నామినేషన్లు వేసే సమయంలో ఎన్డీయే కూటమి, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణలు చోటుచేసుకోగా ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

--------------------------

ప్రకాశం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈ రోజు ప్రారంభమైంది. ఒంగోలు నగరపాలక సంస్థతో పాటు అద్దంకి, దర్శి, చీమకుర్తి మున్సిపాలిటీల్లో మొత్తం 150 వార్డులకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పన కుమారి తెలిపారు. ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని ఐదు ప్రాంతాల్లో నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశామని జిల్లా జాయింట్ కలెక్టర్ తెలుపుతూ,

వాయిస్ 42 సెకన్లు

--------------------------

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రశాంతంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పార్వతీపురం మన్యం జిల్లా సబ్ కలెక్టర్ సచిన్ అర్చిత్ రహార్ తెలిపారు. పార్వతీపురంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో ఈ రోజు పరిశీలించారు. నామినేషన్ల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు శాఖకు సూచించారు. అభ్యర్థులు ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించేలా చూడాలని, నామినేషన్ కేంద్రాల వద్ద గందరగోళం తలెత్తకుండా సిబ్బంది సమర్థంగా విధులు నిర్వహించాలని మన్యం జిల్లా సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఈ రోజు మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవీ అలంకారంలో కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ పెరగడంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. వీఐపీ బ్రేక్ దర్శనాలతో పాటు సిఫార్సు దర్శనాలను రద్దు చేసి, భక్తులందరికీ ఉచిత దర్శనం కల్పిస్తున్నారు. రద్దీ నియంత్రణకు మూడు హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి, ఐదంచెల భద్రత మధ్య భక్తులను క్యూలైన్లలోకి అనుమతిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈ రోజు సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

------------------------

విశాఖపట్నంలో నవంబరులో జరగనున్న 31వ భారత పరిశ్రమల సమాఖ్య - సీఐఐ భాగస్వామ్య సదస్సు--2026కు ముందస్తుగా నిర్వహిస్తున్న ప్రాంతీయ సదస్సుల్లో భాగంగా అమరావతిలోని ఒక ప్రయివేటు విశ్వవిద్యాలయంలో సీఐఐ ప్రాంతీయ సదస్సును ఈ రోజు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, గుంటూరు జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మతో పాటు వివిధ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ ఉదయం మలయప్ప స్వామివారి మోహినీ అవతారంలో దర్శనమిచ్చారు. మరోవైపు తిరుమల బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన గరుడవాహనసేవ ఈ రోజు సాయంత్రం జరగనుంది. గరుడవాహనసేవ ఏర్పాట్లను తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎం. రవిచంద్ర ఈ రోజు పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించామన్నారు. గ్యాలరీల్లో భక్తులకు అవసరమైన అన్నపానీయాలు అందిస్తున్నామని వివరిస్తూ,

వాయిస్ 27 సెకన్లు

------------------------

కృష్ణా జిల్లా గన్నవరం మండలం కొండపావులూరులోని 10వ బెటాలియన్ జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దక్షిణ, దక్షిణ మధ్య జోన్ల ప్రాంతీయ స్థాయి పోటీల్లో తమిళనాడు ఎస్‌డీఆర్ఎఫ్ విజేతగా నిలవగా..ఆంధ్రప్రదేశ్ ఎస్‌డీఆర్ఎఫ్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళం, ఒడిశా రాష్ట్రాలకు చెందిన

ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు పాల్గొన్నాయి బెటాలియన్ ప్రాంగణంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఆపరేషన్స్ ఐజీ సీహెచ్ శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విపత్తుల సమయంలో బృందాలు తమ నైపుణ్యాలు, అనుభవాలు, ఉత్తమ విధానాలను ప్రదర్శించేందుకు ఈ పోటీలు వేదికగా నిలిచాయని చెప్పారు. రసాయన, జీవ, రేడియోలాజికల్, అణు ప్రమాదాల సమయంలో స్పందన, నిర్వహణలో బృందాల నైపుణ్యాలను పెంపొందించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

---------------------------

ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించడం, ఆహార వృథాను అరికట్టడంపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ రోజు ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తిని పెంచడం, పోషకాహార ప్రమాణాలను కాపాడడం, ఆహార వ్యర్థాలను తగ్గించడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశాలు. 1945 అక్టోబరు 16న ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ -ఎఫ్ఏఓ ఏర్పాటైన సందర్భంగా ప్రతి ఏటా అక్టోబరు 16న ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరికీ ఆహారం అందేలా చూడటంతో పాటు, ఆహారాన్ని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరాన్ని ఈ దినోత్సవం తెలియజేస్తుంది.

---------------------------

దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, పరిసర ప్రాంతాలపై ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి వాయువ్య బంగాళాఖాతం వరకు ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటినుండి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి సి.హెచ్ నాగభూషణం తెలుపుతూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఏలూరు జిల్లా కైకలూరు రూరల్ సర్కిల్ పరిధిలో పోలీసు సిబ్బందికి ఈ రోజు 'సాధన' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యకమంలో వివిధ పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా కైకలూరు రూరల్ సీఐ వి. రవికుమార్ మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పోలీసులు పాటించాల్సిన నియమాలపై అధికారులు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ఎన్నికల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత కల్పించి ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని ఆదేశించారు. ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలు చేస్తూ, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని వి.రవికుమార్ స్పష్టం చేశారు.

====================